# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రైవేటీకరణ, సరళీకరణ విధానాలకు బలైపోతున్న గిరిజనులు

**- సిపిఎం**

**ప్రజలారా!**

మన రాష్ట్రంలో 15లక్షల మంది గిరిజనులు ఉన్నారు. వీరు అందరికంటే అన్ని విధాలా వెనుకబడి ఉన్నారు. అక్షరాస్యతలో రాష్ట్రం సరాసరి 67శాతం కాగా, గిరిజనుల అక్షరాస్యత 40శాతమే. తలసరి ఆదాయంలో అట్టడుగు స్థానం వీరిదే. ప్రసవ సమయంలో తల్లుల మరణాలు, శిశు మరణాల్లో మొదటి స్థానం వీరిదే. ఆహార భద్రత కరువు. మలేరియా, విష జ్వరాలతో చనిపోతున్న వారికి లెక్కేలేదు. రోడ్లు, వంతెనలు ఇతర మౌలిక సదుపాయాల్లో వెనుకబాటే. విద్యా సదుపాయాలు ముఖ్యంగా ఉన్నత విద్యా సదుపాయాలు దాదాపు లేవనే చెప్పాలి.

**మరల గిరిజనులను విద్యకు దూరం చేస్తున్న పాలకులు**

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ వల్ల దారుణంగా నష్టపోతున్నది గిరిజనులే. విద్యను ప్రైవేటుపరం చేస్తున్న నేపథ్యంలో ప్రభుత్వ విద్య నిర్వీర్యం అయిపోతున్నది. స్కూళ్లలోటీచర్లు లేరు. కాలేజీల్లో లెక్చరర్లు లేరు. లేబొరేటరీలు లేవు. టీచర్లే లేకుండా చదువు ఎలా వస్తుంది? గిరిజనులకు ప్రభుత్వం నాణ్యతగల విద్య అందించడంలేదు. గిరిజనుల వాడుకభాషలో బోధించే భాషావాలంటీర్లను తీసేశారు. 20మంది పిల్లలకు తక్కువ ఉన్న స్కూళ్లను మూసివేశారు. దీంతో మళ్లీ గిరిజనులు చదువుకు దూరమైపోతున్నారు.

**ఇకముందు ప్రభుత్వ కొలువులు రావు**

మరోపైపు ప్రభుత్వరంగ పరిశ్రమలను, సంస్థలను, సర్వీసులను ప్రైవేటుపరం చేస్తున్నది. ప్రైవేటు రంగంలో గిరిజనులకు రిజర్వేషన్లు లేవు గనుక ఇతరులతో పోటీపడి ఉద్యోగం సంపాదించాలి. నాణ్యతలేని విద్యతో ఎలా పోటీపడగలరు. తరతరాల వెనుకబాటుకు తోడు ప్రభుత్వం తీసుకున్న ప్రైవేటీకరణ విధానాల వల్ల తీవ్రంగా నష్టపోతున్నారు.

**మరల ప్రబలిన మలేరియా**

అలాగే వైద్యంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఖర్చు తగ్గించేస్తున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందుల్లేవు. వైద్య పరికరాల్లేవు. డాక్టర్లు లేరు. సిబ్బంది అసలే లేరు. పర్యవేక్షణా లేదు. పోస్టు గ్రాడ్యుయేషన్‌లో డాక్టర్లు సీటు రాగానే వెళ్లిపోతున్నారు. రికార్డుల్లో డాక్టర్ కనిపిస్తారు. వైద్యం చేయడానికి  డాక్టర్ ఉండరు. కనీసం రక్త పరీక్షలు కూడా చేసే స్థితి లేదు. ప్రభుత్వాల తప్పుడు విధానాల మూలంగా పోయాయనుకున్న మలేరియా, క్షయ వ్యాధులు మళ్లీ విజృంభించి ప్రతి ఏటా వేలాది మందిని పొట్టన పెట్టుకుంటున్నాయి.

**కరెంటు లేదు... రోడ్డులేదు... వంతెన లేదు..**

అంగారక గ్రహానికి వెళ్తున్నాం మన గొప్పతనం చూడండని చెబుతున్న పాలకులకు మన గిరిజనులకు రోడ్డు లేదనే జ్ఞానం లేదు. 4కిలోమీటర్లు రోడ్డుంటే 20కిలోమీటర్లు దూరం తగ్గుతుందన్నా ఆ రోడ్డును దశాబ్దాలుగా వేయని ప్రభుత్వాలు.  లోఓల్టేజితో చీకట్లో మ్రగ్గుతున్న గ్రామాలున్నాయి. అసలు కరంటే లేని గ్రామాలు నేటికీ ఉన్నాయి. కరెంటు పాడైతే బాగు చేయడానికి సిబ్బంది లేరు. లక్షమంది గిరిజనులకు అవసరమైన పూర్ణపాడు లాబేసు వంతెన 68ఏళ్లయినా నిర్మించలేదు. గిరిజనుల పట్ల పాలకుల నిర్లక్ష్యాన్ని చాటుకుంటున్నది ఉదాహరణ..

**రాష్ట్ర విభజనలో తొలి సమిధులు గిరిజనులే...**

పోలవరం ప్రాజెక్టు అంతరాష్ట్ర వివాదం పరిష్కారం కోసం ముంపు ప్రాంతాన్నంతటిని భద్రాచలం మినహాయించి ఆంధ్రప్రదేశ్‌లో కలిపేశారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులంతా తెలంగాణాకు తరలిపోగా, సంవత్సరమైనా నేటి వరకూ ఎపి ప్రభుత్వం ఉపాధ్యాయులు, లెక్చరర్లు, ఉద్యోగులనునియమించలేదు. స్కూళ్లు మూత, కాలేజీల్లో చదువుల్లేవు. డాక్టర్లు, సిబ్బంది లేక ఆసుపత్రుల్లో వైద్యం లేదు. ఆర్డీవోతో సహా రెవెన్యూ సిబ్బంది లేరు. బ్రతికుండగానే నరకం చూపించడమంటే  ఇదే.

**నీరున్నా గిరిజన భూములకు నీరివ్వరు...**

నదులకు, మహానదులకు, సెలయేళ్లకు పుట్టిళ్లు గిరిజన ప్రాంతం. తమ దగ్గరనుంచే అన్నీ మైదానానికి ప్రవహిస్తాయి. కానీ గిరి జనులకు నీరు అందని ద్రాక్షే. తమ చుట్టూ శబరి, గోదావరి, సీలేరు, గోముఖి, సువర్ణముఖి, చంపావతి, అడారుగెడ్డ, గుమ్మడిగెడ్డ, రాళ్లగెడ్డ తిరుగుతుంటాయి. నాలుగు రాళ్లు అడ్డం పెడితే భూములకు నీళ్లు మరలుతాయి. కానీ పాలకులకు ఆ గిరిజనులకు అవసరమైన చిన్న చిన్న ప్రాజెక్టులు కూడా కట్టరు. ఈ గిరిజనులను ముంచేందుకు ఒక్క క్షణం కూడా ఆలోచించరు. కనీస ప్రత్యామ్నాయం చూడకుండా నిర్దాక్షిణ్యంగా ప్రాజెక్టుల్లో గిరిజనులను ముంచేస్తున్నారు.

**అభివృద్ధి అంతా గిరిజనుల వినాశనానికే**

గనులన్నీ కొండల్లోనే వున్నాయి. ఆకొండలే గిరిజనులకు ఆవాసం, ఆధారం, గనులను వెలికి తీసేందుకు గిరిజనులను నిర్వాసితులను చేస్తున్నారు. గిరిజనులూ మనుషులే. వారికి ప్రత్యామ్నాయం చూపించకుండా అభివృద్ధి పేరుతో గిరిజనుల జీవితాలను ధ్వంసం చేస్తున్నారు. అమెరికా వాడికి అల్యూమినియం కావాలిస్తే మన అరుకు, అనంతగిరి, విశాఖ గిరిజనులకు చావు వస్తుంది. జపాన్‌కు ఇనుప ఖనిజం తరలించడానికి మన దండకారణ్యంలో గిరిజనులు నాశనమే. ఎంత కిరాతకం? విదేశస్తుల లాభాలకోసం దేశ గిరిజనుల్ని బలివ్వాలా?

**100శాతం గిరిజనులున్న ఐదో షెడ్యూల్‌లో చేర్చరు**

గిరిజన ప్రాంతానికి ఆనుకొని వున్న నూటికి నూరుశాతం గిరిజనులున్న గ్రామాలను కూడా ఐదో షెడ్యూల్‌లో నుంచి తప్పించేశారు. రాజ్యాంగపరమైన రక్షణ లేకపోవడంతో వారి భూములను గిరిజనేతర భూస్వాములు ఆక్రమించేశారు. మన గిరిజనులు వారి భూమిలోనే వారు కూలీలుగా మారిపోయారు. ఐదో షెడ్యూల్‌లో లేకపోవడం వల్ల చదువుక్ను గిరిజన యువత ఉద్యోగ, ఉపాధిలో అన్యాయమైపోతున్నారు.

**గిరిజనులకు స్వయంపాలిత హక్కు ఇవ్వరు**

రాజ్యాంగంలో ఆరో షెడ్యూల్ ప్రకారం గిరిజనులను గిరిజనులే పాలించుకొనేలా గిరిజన స్వయంపాలిత ప్రాంతాలకు అవకాశం ఉంది. ఒక త్రిపురలో తప్ప దేశంలో ఎక్కడ అమలుచేయడంలేదు. గిరిజనులపై గిరిజనేతరుల పెత్తనం అనేక విధాలా సాగుతున్నది. పాలనా యంత్రాంగం గిరిజనులను పట్టించుకోవడంలేదు. కాంగ్రెస్, బిజెపి, టిడిపి  పార్టీన్నింటి విధానం ఒకటే. గిరిజనులను దోచి పెట్టుబడిదార్లకు పెట్టడమే. కనుక గిరిజనులంతా ఐక్యమై తమ న్యాయమైన హక్కులు సాధించుకోవాలని సిపిఎం విజ్ఞప్తి చేస్తున్నది.

**- సిపిఎం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ**